క్లుప్తంగా

ఉర్దూ కాంప్లెక్స్‌లు కొనసాగించాలి



మాట్లాడుతున్న సయ్యద్ ఇక్బాల్

వైవీయూ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్జీటీ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను యథావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లోనే కొనసాగించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఆదివారం కడప నగరంలోని రూటా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల హడావుడి నిర్ణయాలతో ఉపాధ్యాయుల సర్దుబాటులో ఉర్దూ పాఠశాలలకు లాభం కన్నా నష్టం ఎక్కువ జరిగిందన్నారు. ప్రధాన సలహాదారు డాక్టర్ అయూబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్నారు. రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ అబ్దుల్ హకీం సాహెబ్ మాట్లాడుతూ రోష్నీ పథకం ప్రారంభించి ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరాజుద్దీన్, మహమ్మద్ అయూబ్, తయ్యుబ్, షహబుద్దీన్, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 21వ అష్రఫ్, ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంటులో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. క్రీడాకారులకు విస్డమ్ స్కూలు వైస్ ప్రిన్సిపాల్ షంటూ, వైఎస్సార్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారిలు వీటిని అందజేశారు. ఈ టోర్నమెంటులో వినూత్ మొదటి, రెండవ స్థానంలో రెడ్డి పవన్, మూడవ స్థానంలో అనురాగ్, తర్వాతి స్థానాలలో ప్రభుదేవా, కరీముల్లా, ప్రణవ్, నవీన్, ఫరూఖ్, రేహాన్, ఉమాదేవి నిలిచారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 100 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోచ్ తబస్సుమ్, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆషారే షరీఫ్ దర్శనం

కడప కల్చరల్ : కడప నగరంలో సోమవారం ఆషారే షరీఫ్ దర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటలకు స్థానిక మస్తాన్‌వలీ వీధిలోని అస్థానె-యే-నూరియా బహిష్టియాలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే సాయిపేటలోని బొగ్దాదియా నగర్‌లో గల అస్తానె బొగ్దాదియాలో సాయంత్రం 5 గంటల నుంచి ఆషారే షరీఫ్‌ను దర్శింపజేయనున్నారు.

ఘనంగా హిందీ దివస్

వైవీయూ: కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా హిందీ దివస్‌ను నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హిందీ ఉపాధ్యాయుడు ఫర్హతుల్లా ముఖ్యఅతిథి విచ్చేసి హిందీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ్‌కుమార్, అనంతలక్ష్మి, హిందీ అధ్యాపకుడు మునీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలి

కడప రూరల్ : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని రజకులను కూడా షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రజక కార్పొరేషన్ పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రజక వృత్తితో సంబంధం ఉన్న వారిని చైర్మన్‌గా నియమించాలని తెలిపారు. రజక వృత్తిపై ఆధారపడి జీవించే వారికి ఉచితంగా కరెంటును ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రజక సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సి.కృష్ణమూర్తి, ఎరుకలయ్య, డాక్టర్ పిచ్చయ్య, చింతకుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక అఖిల్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు పలు నృత్యాలకు వన్స్‌మోర్ అంటూ ప్రతిస్పందించారు. కార్యక్రమాలను శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

ప్రైవేటీకరణ సరికాదు



ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా ఐదు వైద్య కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. ఒక్కో కళాశాలకు 150 సీట్లు వచ్చేవి. కళాశాలలు నడపలేమంటూ కేంద్రానికి లేఖ రాయడం చూస్తుంటే.. విద్యార్థుల భవిష్యత్తు పట్ల చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోంది. మెడికల్ కళాశాలల నిర్వహణకు తోడ్పాటు అందించాల్సిపోయి ఒక్క మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయలేదని మంత్రి సత్యకుమార్ చెప్పడం దారుణం.

- సునీత, రెడ్డి కాలనీ, కడప



వైద్య విద్యకు నిరుపేదలను దూరం చేయడమే



టీడీపీ ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది. రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 వైద్య కళాశాలలను మంజూరు చేసింది. వాటిలో ఐదు ప్రభుత్వ కళాశాలలు, 12 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. నాటి వైఎస్ జగన్ ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సహిస్తే దానిని సమర్థించకుండా మంత్రి సత్యకుమార్ వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదు. కళాశాలలు నడపలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను తక్షణమే ఉపసంహరించుకోవాలి.

- ఏసమ్మ, ప్రకాశ్‌నగర్, కడప

మరమ్మతులు మరిచారు



జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా దెబ్బతిన్న రహదారి



చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ పక్కన రోడ్డుపై గుంతలు

- రోడ్లపై ఏర్పడ్డ గుంతలు
- ప్రమాదకరంగా మారిన వైనం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో అభివృద్ధి పనులు చేయడం వల్ల ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో.. అవి ప్రమాదాలకు నెలవుగా మారాయి. కొన్ని చోట్ల రోడ్లపై కాలక్రమేణ ఏర్పడిన గుంతలు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ పక్కన ముత్రాసుపల్లెకు పోయే రోడ్డును పగులగొట్టి స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరదనీటి కాలువ) నిర్మించారు. అయితే రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో డ్రైన్ కట్టిన చోట గుంత ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ నిత్యం వేలాది మంది తమ పిల్లలను స్కూళ్లకు తీసుకుపోతుంటారు. రోడ్డుపై పెద్ద బండరాళ్లు, గుంతలు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట తారు రోడ్డు పాడైపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు అది పెద్ద గుంతగా మారింది. మూడు రోడ్ల సెంటర్‌లో గుంత ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మినీ బైపాస్‌లో సంజన్న సర్కిల్‌లో పైపులైన్ కోసం రోడ్డును పగులగొట్టారు. పైపులు వేసిన తర్వాత రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడం వల్ల గుంతలా మారింది. చిన్న వర్షానికే ఈ గుంతలో నీళ్లు నిలుస్తున్నాయి. భారీ వాహనాలు తిరిగే రోడ్డు కావడంతో పైపులైన్ కూడా దెబ్బతినే ప్రమాదముంది.



సంజన్న సర్కిల్‌లో ఏర్పడ్డ నీటి గుంత

- ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మూసుకుపోతున్న దారులు



జర్నలిస్టు కాలనీలో రోడ్డు వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- విషపురుగులతో సహజీవనం
- నగర శివారు ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు దారులను మూసేస్తున్నాయి. ఇళ్ల పక్కన, ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట ఇవి ఏపుగా పెరిగి పోతున్నాయి. రామాంజనేయపురం, జర్నలిస్టు కాలనీ, వరదకాలనీ, ఆచారి కాలనీ ప్రాంతాల్లో రోడ్ల వెంట ఈ పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఎక్కువయ్యాయి. దీంతో విషపురుగులు, దోమలు, పురుగులు కూడా ఎక్కువయ్యాయని, పగలు, రాత్రి అనే తేడా లేకుండా బయటికి రావాలంటే భయం వేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్లతో రోడ్లు కుచించుకుపోవడం వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడ కంప చెట్లను తొలగించాలని, రోడ్లను శుభ్రంగా ఉంచాలని కమిషనర్ చెబుతున్న మాటలు బేఖాతర్ అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



పీఎఫ్ క్వార్టర్స్ పక్క వీధిలో ఆచారి కాలనీలో రోడ్డుకు ఇరువైపులా..

‘మోక్షగుండం’ జీవితం.. స్ఫూర్తిదాయకం



విద్యుత్ భవన్‌లో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు



ట్రాన్స్‌కో నిలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు



విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఖాదర్‌బాషా



ఎల్ఐసీ సర్కిల్‌లోని విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీటీసీపీఓ క్రిష్ణసింగ్

కడప కార్పొరేషన్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ పేర్కొన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా స్థానిక విద్యుత్ భవన్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విశ్వేశ్వరయ్యసర్కిల్‌లోని మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

- ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్లలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ముఖ్యుడని డీటీసీపీఓ క్రిష్ణసింగ్ అన్నారు. ఎల్ఐసీ సర్కిల్‌లోని మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- శంకరాపురంలోని ట్రాన్స్‌కో నిలయంలో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణమనాయుడు ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, ఎస్ఈ బాషా, ఈఈలు రామిరెడ్డి, ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చాంద్‌బాషా, నాగమునిస్వామి, రమణ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతరత్న మోక్షగుండెం విశ్వేశ్వరయ్యను నేటి ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించే స్థాయికి చేరాలని జేకే యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పఠాన్ ఖాదర్ బాష తెలిపారు. నగరంలోని మోక్షగుండెం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి ప్రతినిధి కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని గ్రామోత్సవం

కడప కల్చరల్ : ‘తొమ్మిది రోజులపాటు మా పూజలు అందుకున్న వినాయకా...ఇక వచ్చే ఏడాది మళ్లీ కలుద్దాం’... అంటూ భక్తులు గణపతికి వీడ్కోలు పలికారు. ఆదివారం వినాయక చవితి తొమ్మిదవ రోజు సందర్భంగా స్థానిక కోపరేటివ్ కాలనీలోని మట్టి వినాయకుడిని నిమజ్జనం చేశారు. 40 ఏళ్లుగా కో ఆపరేటివ్ కాలనీలో మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం పూజలనంతరం కమిటీ ప్రతినిధులు, స్థానిక పెద్దలు, యువత, పిల్లలు ప్రత్యేక వాహనంపై గణపతిని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. తరువాత గంగ ఒడికి చేర్చారు.



కో ఆపరేటివ్ కాలనీలో వినాయకస్వామి ఊరేగింపు

మాదకద్రవ్యాల నిర్మూలనకు తోడ్పాటు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిరోధ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 10 వేల కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల యువత తప్పుదోవ పడుతున్న తరుణంలో ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వల్ల ఎదురయ్యే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, ప్రజలకు కలిగే వివిధ నష్టాల గురించి కరపత్రాలు ముద్రించారు. వాటిని కడప నగరంలో ముఖ్య ప్రాంతాలైన పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రైల్వే స్టేషన్, రాజీవ్‌పార్క్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమరిటన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు భరత్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, సంస్థ సభ్యులైన శ్రీకాంత్, అరుణ్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



బస్సులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అశోక్

పాత కలెక్టరేట్‌ను అందంగా తీర్చిదిద్దుతాం



ప్రభుత్వ ఇంజినీర్లను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

- ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు
- ప్రభుత్వ ఇంజినీర్లు ప్రకటన

కడప కల్చరల్ : పాత కలెక్టరేట్‌ను అందంగా తీర్చిదిద్ది జిల్లాకు వారసత్వ కానుకగా అందజేస్తామని పలువురు ప్రభుత్వ ఇంజినీర్లు తెలిపారు. మోక్షగుండెం విశ్వేశ్వరయ్య 163వ జయంతి (ఇంజినీర్స్ డే) సందర్భంగా ఆదివారం స్థానిక మానస సమావేశం మందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో సభ్యులైన ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మానవజాతి మేధకు ఇంజినీర్లే నిదర్శనమని కొనియాడారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ తమకు ఇంజినీరింగ్ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని, వారసత్వ సంపద అయిన పాత కలెక్టరేట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఎస్ఈ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ సమాజ హితమైన పనులు చేస్తుండడంతోనే ప్రజల్లో దానికి విశ్వాసం పెరుగుతోందని, పాత కలెక్టరేట్‌ను నియమ నిబంధనలకు అనుగుణంగా, అద్భుతమైన భవనంగా మార్చి వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, డీఈలు చెన్నకేశవరెడ్డి, మూర్తి మురళి, సుధాకర్, లయన్స్ పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, షేక్ నియాజ్, ఆకుల సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో..

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ లోకల్ సెంటర్, కడప ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేగా ఘనంగా నిర్వహించారు. లోకల్ సెంటర్ చైర్మన్ ఆదినారాయణరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, గంజికుంట ఫౌండేషన్ ప్రతినిధి రవీంద్రనాథ్‌ల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఇంజినీర్లు, మున్సిపల్ లైసెన్స్ యేట్స్‌లు ర్యాలీ నిర్వహించారు. విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇంజినీర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పేద విద్యార్థుల కోసం సేవలు అందిస్తున్న సీనియర్ సభ్యులు, ఇతర ప్రముఖ ఇంజినీర్లకు గంజికుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. ఇంజినీర్లు మోహన్ రామిరెడ్డి, బీటీ ప్రసాద్, గోపాల్, గౌరీశంకర్, రామచంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, బ్రహ్మానందరెడ్డి, కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌లను గంజికుంట ఫౌండేషన్, యువరాజ్ ఇంజనీర్స్, వంశీకృష్ణ అసోసియేట్స్ ఆధ్వర్యంలో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

వేంపల్లె : నందిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు శ్రీనువాసులురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. నందిపల్లె నుంచి మోటారు బైక్‌లో ఉపాధ్యాయుడు శ్రీనువాసులురెడ్డి వస్తుండగా గుర్రమ్మ లిఫ్ట్ అడగడంతో వాహనం నిలిపారు. వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో శ్రీనివాసులురెడ్డి, గుర్రమ్మలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

హనుమద్వాహనంపై రంగనాథస్వామి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని రంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల సందర్భంగా ఆదివారం సతీ సమేత రంగనాథస్వామి హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు కానుకలను సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందు చేశారు. సమీపంలోని సాయిబాబా, అంజనేయస్వామి, అక్కదేవతలు, వీరభద్ర స్వామి, వైద్యనాథేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వల్లూరు : వల్లూరు మండలం గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ చదువుతున్న కె.కీర్తన క్యారం బోర్డు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుశీలమ్మ ఆమెను అభినందించారు.

కొండాపురం: చక్రాయపేట మండలంలోని గండిలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ క్రిష్ణవేణి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగవల్లి(ఎంపీసీ) ఖోఖోకు, జి.కీర్తన(ఎంపిసి) హ్యాండ్‌బాల్‌కు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని టి.తులసి హ్యాండ్‌బాల్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేంపల్లె : ఆ నాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధుర స్మృతులే అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. వేంపల్లె పట్టణంలోని తలిశెట్టి శేషమ్మ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 1985–86లో పదోతరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి పాత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. నాడు బోధించిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ నమస్కార వందనం చేశారు. తమ గురువులు మంగమ్మ, సరస్వతమ్మ, శకుంతలమ్మ, సరోజమ్మలకు దుస్తులు సమర్పించి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు షకీల, రాజేశ్వరి, నాగవల్లి మాట్లాడుతూ స్నేహితులతో పంచుకున్న నాటి జ్ఞాపకాలు, గడిపిన మధురమైన క్షణాలను 38 ఏళ్ల తర్వాత తలచుకుని ఆనందంగా గడిపామన్నారు. ఈ కార్యక్రమంలో సరళ, సరస్వతి, పద్మ, షకీలాభాను, సుశీల, షాకీరా, శ్రీదేవి, రెడ్డెమ్మ, సుజాత, యల్లమ్మ, పద్మజ, గురుదేవి, వాసవి, రమాదేవి, సిద్దేశ్వరి, జయలక్ష్మి, సరళ, సాయిలక్ష్మి రమ, నిరంజనమ్మ పాల్గొన్నారు.

నేత్రదానం

పులివెందుల రూరల్ : కుమారులు మానవత్వం చూపారు.. తమ తల్లి మరణించడంతో ఆమె నేత్రాలు దానం చేశారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతాకు పెద్దక్క(52) ఆదివారం మరణించారు. ఆమె కుమారులు రామాంజనేయులు, ప్రభాకర్, కుమార్తె మరియమ్మ పెద్దక్క నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో వచ్చి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ నేత్రనిధికి పంపారు.